వైభవంగా శ్రీకపిలేశ్వరస్వామి తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం తెప్పోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీవినాయక స్వామివారు, శ్రీచంద్రశేఖర స్వామివారు తెప్పపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. తెప్పోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పోత్సవం కన్నుల పండుగగా జరిగింది. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై ఆశీనులైన శ్రీవినాయకస్వామి, శ్రీచంద్రశేఖర స్వామివారు కపిలతీర్థం పుష్కరిణిలో ఐదు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి కర్పూర నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు అలరింపజేశాయి. తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం శ్రీసుబ్రమణ్యస్వామి వారు తెప్పను అధిరోహించి ఐదు చుట్లు విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.


తెప్పపై శ్రీవినాయకస్వామి, శ్రీచంద్రశేఖరస్వామి

భాష్యంలో బాల గణిత మేధావులు

తిరుపతి ఎడ్యుకేషన్: ధనలక్ష్మినగర్‌లోని భాష్యం స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం గణిత ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ ప్రొఫెసర్ సుగుణమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణితం దైనందిన జీవితంలో ప్రతినిత్యం ఉపయోగించుకుంటామని తెలిపారు. గణితంలో ప్రతిభ కలిగిన విద్యార్థులు మిగిలిన సబ్జెక్టులలో కూడా చురుకుగా ఉంటారన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రొఫెసర్ సుగుణమ్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, హెచ్ఎం కీర్తి బహుమతులను అందజేశారు. విజేతలకు భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణరావు అభినందనలు తెలియజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణరావు

మూడు కేజీల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైమ్: చెన్నారెడ్డి కాలనీలో అక్రమంగా తరలిస్తున్న మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తిరుపతి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. కొండ ముని భరణి, బిల్లు జయకృష్ణ మూడు కేజీల గంజాయిని స్కూటర్‌పై తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి కేజీల గంజాయి, ద్విచక్ర వాహనం, రూ.13000 స్వాధీనం చేసుకున్నారు.

నర్సింగ్ యువతి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: ఉరి వేసుకుని నర్సింగ్ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తిరుపతి భవానినగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. అన్నమయ్య జిల్లా చిట్వేలు మండలం మిట్టపల్లికి చెందిన కె.ప్రియాంక ఓ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. భవానినగర్‌లోని ఓ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. శుక్రవారం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది గుర్తించిన హాస్టల్ సిబ్బంది పోలీసులకు, బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. మృతురాలి అక్క అనిత ఫిర్యాదు మేరకు ఈస్ట్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు విచారణ చేస్తున్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు

తిరుపతి అర్బన్: తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో సంస్కృతం తెలుగు విభాగాల ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు విలువైన పుస్తకాలను బహూకరించిన విషయాన్ని వెల్లడించారు. తెలుగు అధ్యాపకులు జె.కొండలరావు, ఎస్.వసంతకుమారి, పి.శివకుమారి, కె.శ్రీదేవి, బి.సులోచనరాణి, మణి, ఎస్.జయలక్ష్మి, పి.సరిత, ఎ.వెంకటరమణమ్మ పాల్గొన్నారు.


అధ్యాపకులతో విద్యార్థులు

స్విమ్స్ వైద్యురాలికి ఫెలోషిప్

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీలో బయో కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం ఎం సుచిత్ర ఫెలోషిప్ అందుకున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. ముంబయిలో ఈ నెల 14న జరిగిన అసోసియేషన్ ఆఫ్ మెడికల్ బయోకెమిస్ట్రీస్ ఆఫ్ ఇండియా 30వ వార్షిక జాతీయ సదస్సు సందర్భంగా ఫెలోషిప్ అవార్డును ఆమె అందుకున్నట్లు తెలిపారు. అవార్డు అందుకున్న ఆమెను స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం అభినందించారు.


సుచిత్రను అభినందిస్తున్న స్విమ్స్ డైరెక్టర్

స్త్రీ, పురుషులిద్దరూ సమానమే

తిరుపతి సిటీ: సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ మహాలక్ష్మి పావని అన్నారు. ఎస్వీయూ న్యాయవిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వర్సిటీ సెనేట్ హాల్‌లో లింగ సున్నితత్వం చట్టపరమైన అవగాహన అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ప్రధానవక్తగా హాజరై, ప్రసంగించారు. సమాజంలో లింగ అసమానతలు పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ న్యాయవాద వృత్తిలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమెను వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ హుస్సేన్, డీన్ వీఆర్సీ కృష్ణయ్య, న్యాయ విభాగ అకాడమిక్ కన్సల్టెంట్లు నిర్మల, భవ్య, విజయలక్ష్మి, అమరేశ్వరి, శ్రీలక్ష్మి, మంజుల, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌తో పరిష్కారం

తిరుపతి కల్చరల్: కుటుంబ కలహాలను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించవచ్చని తిరుపతి జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాస్ కుటుంబ సలహా కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, పీడీ వి.నాగరాజు, సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నోటిఫికేషన్ రద్దు

తిరుపతి అర్బన్: పౌరసరఫరాల విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్–3 పోస్టును భర్తీ చేయడానికి శుక్రవారం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కొన్ని అనివార్య, సాంకేతిక కారణాల నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు ఆ విభాగం జిల్లా మేనేజర్ వై.సుమతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టుల భర్తీకి సంబంధించి తదుపరి వివరాలను వెల్లడిస్తామని ఆమె స్పష్టం చేశారు.

ఘనంగా గణిత దినోత్సవం

తిరుపతి అర్బన్: విద్యార్థులు శ్రీనివాస రామానుజన్‌ను మార్గదర్శకంగా తీసుకోవాలని శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మహదేవమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని వేడుకగా జరుపుకున్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

తిరుపతి కల్చరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపంలో స్వామివారికి భక్తుడు టీవీ.మనోహర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీలక్ష్మీ నారాయణ స్వామి వారికి, శ్రీగోదాదేవి అమ్మవారికి, శ్రీపెరియాళ్వార్, శ్రీఆంజనేయస్వామి వారికి పట్టు వస్త్రాలను మనోహర్ దంపతులు సమర్పించారు. స్థానిక ఆలయాల డెప్యూటీ ఈవో ఏఆర్. శాంత, ఏఈవో మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, షరాబు పి.దేవయ్య పాల్గొన్నారు.


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న భక్తుడు మనోహర్ కుటుంబ సభ్యులు

పార్లమెంట్‌ను రక్షించలేని పాలకులు

తిరుపతి కల్చరల్: పార్లమెంట్‌ను రక్షించలేని పాలకులు ప్రజలను ఎలా రక్షిస్తారని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించారు. 141 మంది ఎంపీలను సస్పెండ్ చేయడంపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం నేత పుల్లయ్య, కాంగ్రెస్ నేత బత్తయ్య నాయుడు మాట్లాడుతూ 141 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నిరంకుశ పాలనకు అద్దం పడుతోందన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ

తిరుపతి కల్చరల్: లక్కీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని టెన్త్ విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు సూర్య పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని తెలిపారు. బాగా చదువుకునే విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కేఎస్ఆర్ మూర్తి, కోశాధికారి ప్రత్యూష, సభ్యులు సురేష్ విశ్వనాథ్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం గుర్తింపు సంబరాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు ప్రభుత్వం రాష్ట్ర గుర్తింపు ఇచ్చిన నేపథ్యంలో ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం మంగళం డిపోలో కేక్ కట్ చేసి ఉద్యోగులు పండుగలా నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు, చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి, తమ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి మంగళపు ప్రకాష్, చైర్మన్ పీజీ రఘునాథరెడ్డి, ప్రెసిడెంట్ షరీఫ్‌లు మాట్లాడుతూ కార్మికులమైన తమను ప్రభుత్వం విలీనం చేయడంతో ఉద్యోగులమయ్యామని పేర్కొన్నారు. కార్మికులను ఉద్యోగులు చేసిన గొప్పనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.


మంగళం డిపోలో సంబరాలు

రిపబ్లిక్‌డే పరేడ్‌కు మహిళా వర్సిటీ విద్యార్థి

తిరుపతి సిటీ: న్యూఢిల్లీలో వచ్చే నెల 26న జరగనున్న రిపబ్లిక్‌డే పరేడ్‌కు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా ఉన్న హీనా ఫాతిమా అనే విద్యార్థిని ఎంపికయ్యారు. ఆమెతోపాటు తెలంగాణ కంటింజంట్ లీడర్‌గా వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.స్వాతి నియమితులయ్యారు. రిపబ్లిక్ డే పరేడ్‌కు డిసెంబర్ 31న హైదరాబాద్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాంలో వారు పాల్గొననున్నారు. వీరిని వర్సిటీ వీసీ డి.భారతి, పి.మాధవి, మాధురి పరదేశి అభినందించారు.



హీనా ఫాతిమా, కె.స్వాతిని అభినందనలు

వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం

తిరుపతి మంగళం: అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ నిఘావిభాగం డీఎఫ్‌వో ఎం.శివకుమార్ తెలిపారు. రహస్య సమాచారం మేరకు శుక్రవారం ఎల్లమందక్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. స్మగ్లర్లు ఓ వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్లిపోయారని, దాంతో వారిని వెంబడించి ఏపీ 27–బీఎస్ 6084 నంబర్ గల మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. కారును పరిశీలించగా అందులో 16 ఎర్రచందన దుంగలున్నట్టు పేర్కొన్నారు. దాడుల్లో ఫ్లైయింగ్‌స్క్వాడ్ కె.వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి రమణమూర్తి, బీట్ అధికార్లు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని చూపుతున్న అటవీశాఖ అధికారులు

సోషల్ మీడియా కీలకం కావాలి


గుర్తింపు కార్డులను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ సోషల్ మీడియా కీలక భూమిక పోషించాలని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ కార్యక్రమాలను, తిరుపతి నగరంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతోపాటు తిరుపతి నగరంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సోషల్ మీడియాపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బాలిశెట్టి కిషోర్, కో కన్వీనర్ మైలాం శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి నియోజకవర్గ కన్వీనర్ సర్వ తేజా, మద్దాలి శేఖర్, కో–కన్వీనర్లు కొఠారి సుభాష్, దండు ముకేష్, స్మార్ట్ రాజేష్, కొప్పల లోకేష్ బాబు వెలంపల్లి రఘురాం, ప్రసన్న కుమార్, కపూరి సుభాష్, గంగయ్య, ముర బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. నగరపాలక సంస్థ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ డేను కమిషనర్ నిర్వహించారు. ఉద్యోగ సంఘం నాయకులు కమిషనర్‌ను కలసి పలు సమస్యలను విన్నవించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, యూనియన్ నాయకులు తులసేంద్ర, మదన్ మోహన్, దొరస్వామి, హరి పాల్గొన్నారు.

చంద్రగిరిలో సలార్ సందడి

చంద్రగిరి: రెబెల్ స్టార్ ప్రభాస్ నటించిన సలార్ మొదటి భాగం ప్రపంచ వ్యాప్తంగా శుక్రవారం విడుదలైంది. ఈ క్రమంలో శుక్రవారం ఆయన అభిమానులు చంద్రగిరిలోని ఎస్వీ సినిమాస్ వద్ద కోలాహలం చేశారు. రెబెల్ స్టార్ అభిమాన నాయకుడు పుల్లూరు సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ నుంచి 200 మందికి పైగా అభిమానులు బాణసంచా పేలుస్తూ సినిమా హాలు వద్దకు చేరుకున్నారు. హాలు ముందు డీజే పాటలు, ప్రత్యేక బ్యాండ్ సెట్‌లతో పండుగ వాతావరణం సృష్టించారు.


టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద ఊరేగింపు